

# కోవెల చెప్పిన కథ

ఆర్. జయకుమార్

## 1

## రాజశేఖరం చెప్పిన కథ

నేనో మధ్య తరగతి యువకుణ్ణి- నా చుట్టూవున్న సమాజంలో జరుగుతున్న సంఘటనలను పరిశీలించగలుగుతున్నానే గాని. నేను ఎదుర్కొనే ప్రశ్నలకు సమాధానాలు యివ్వలేకపోతున్నాను.

'భావనారాయణ!'

భావనారాయణ నాకున్న మిత్రులలో ఒకడని చెప్పను. అతడే నాకున్న ఏకైక మిత్రుడు- ఆప్తుడు. కులం పేరుతో విభజించబడ్డ ఈ సమాజంలో - నన్ను అధమ కులస్థుణ్ణిగా అవహేళన చేసే వాళ్ళతో ఈ సమాజం సతాయించే రోజుల్లో నన్ను సాటి మనిషిగా గుర్తించినవాడు భావనారాయణ!

చిన్నప్పటినుంచీ అతనితో ఎంతో పరిచయం నాకు. భావనారాయణకో చెల్లెలు కూడా వుంది. ఆ అమ్మాయి పేరు సీత- ఆ అమ్మాయితోనూ చిన్నప్పటి నుంచీ పరిచయమే నాకు. నవయవ్వ

నంలో ఆ అమ్మాయికి నేను నా మనసులో పెట్టుకున్న పేరు 'కుందనపు బొమ్మ' భావనారాయణకు సీత 'చిట్టి తల్లి!'

'ఎవరూ ప్రేమలో పడరు, ఎగిరి పోతారు తేలిగ్గా' అన్నదెవరో తెలీదు గాని-చిన్నప్పట్నించీ సీతతో వున్న పరిచయం యవ్వనంలో ప్రేమగా పరిణతి చెందింది. కుందనపు బొమ్మను ఎన్నోసార్లు నా కలల్లో, కనుబొమ్మల్లో ఉంచేసుకున్నాను.

అయినా నా ప్రేమను తెలుపుకోడానికి నాకు ధైర్యం లేదు. నే నెక్కడ? ఆమెక్కడ?

భావనారాయణకు డిగ్రీ తరువాత ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది.

నాకూ ఉద్యోగం వచ్చింది. కానీ నా విషయంలో అది ఊళ్ళు పట్టుకుతిరిగే వుద్యోగం. అందుకే డిగ్రీ తరువాయి ఐదేళ్ళపాటు నాకూ భావనారాయణకూ మధ్య సంబంధం లేకుండా పోయింది-

ఇన్ని సంవత్సరాలైనా సీత నా మదిలోనుంచి చెదిరిపోలేదు. సీతను నేనెలా మరిచిపోగలను? మానవతా దృష్టితో నన్ను మనిషిగా గుర్తించిన అమ్మాయి 'కుందనపుబొమ్మ' అయినా నా అత్యాశ గాని ఆమెనెలా నాదానిగా ఊహించుకోగలను? అసలు ఆమె ఆలోచనలో నే వుంటానా? నా పిచ్చిగాని యీ ఐదు సంవత్సరాలలో ఆ అమ్మాయికి పెళ్ళి కూడా అయిపోయుంటుంది. పెళ్ళయిన అమ్మాయి గురించి ఆలోచించడం తప్పు కాదూ?

ఐదు సంవత్సరాల తరువాయి మా వూళ్ళో అడుగుపెట్టాను. అకస్మాత్తుగా మావూరి వీరభద్రేశ్వరస్వామి కోవెల వీధిలో తటస్థపడినాడు భావనారాయణ!

"రాజశేఖరం!" అన్నాడు నన్ను చూసిన సంతోషంలో-ఆశ్చర్యంలో!

భావనారాయణ మునుపటిలా లేడు. జీవితంలో ఢక్కా-మొక్కీలు తిన్నవాడిలా ఓ నలభై పడిలో పడినవాడిలా అగుపించాడు అతను.

"బావున్నావా భావన్? మనిషి సన్నబడిపట్టున్నావ్? అసలు వేళపట్టున తింటున్నావా లేదా? సీత అదేరా బాబూ-నీ చిట్టి తల్లి నిన్ను వస్తున వదేస్తుందేమిటి? అయినా సీత యింకా నీ దగ్గరే ఎందుకుంటుందిలే! ఎక్కడో అత్తవారింట్లో కులాసాగా ఆనందంగా వుండివుంటుంది. పోనీ మాటవరసకైనా శుభలేఖ పంపించకూడదా? అవునులే-నా చిరునామా నీకెలా తెలిసుంటుందని? అసలే నేనో దేశదిమ్మరిగా ఊళ్ళమీద పడ్డవాణ్ణి-అడ్రసు రాయని కార్డుముక్కలాంటి వాణ్ణి- శుభలేఖ ఎలా పంపిస్తావు-పంపాలని వున్నా? అంతేకదా మరి భావన్!"

నా మాటలు ఫుల్‌స్టాపులు, కామాలు లేని పేరాగ్రాఫులా సాగిపోయేదే కాని అతను తలవంచుకుని మౌనంగా వుండి



మానాన్నకు ఇస్తానన్న కట్నం తెస్తేనే నాకు పెళ్ళిచెయ్యడట్లు ఉంది అమ్మా!!

పోవటం జరిగింది

"ఏమిట్రా భావన్! నేను వసపిట్టలా వాగేస్తూవుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినవాడిలా వున్నావు-ఏదైనా మాట్లాడు" అన్నాను వాడి గడ్డాన్ని నావైపు తిప్పుతుంటూ

రోజుల తరబడి ఆలోచనలతో పోరాటం సాగించే మనిషి కళ్ళక్రింద కనిపించే చారలు-భావన్ కనుకొలకుల్లో కన్నీరు-నన్ను కదిలించివేసాయి.

అసలు మా భావన్ ఇతడేనా?

"భావన్-ఏమిటిది?" అన్నాను.

"స్తబ్ధత కొద్దిగా విడింది. రాజశేఖరం...." అంటూ మొదలుపెట్టాడు భావనారాయణ ఇద్దరం మెల్లగా వీరభద్రేశ్వరుని ఆలయంవైపు అడుగులు వేసాము.

## 2

## సీత చెప్పిన కథ

నేనో మధ్య తరగతి యువతిని. నాకో అన్నయ్య వున్నారు. తమ్ముళ్ళుగానీ, చెల్లెళ్ళుగానీ ఎవ్వరూ లేరు. మా నాన్న దశరథరామయ్యగారు-బయటి ప్రపంచానికి ఆయన పెద్దమనిషి. మా యింటి వరకూ నా చిన్నప్పుడు చదువుకున్న 'మా నాన్న మంచినాన్న' కథల్లో నాన్న మాత్రం కారు.

మా అన్నయ్య భావనారాయణ పుట్టిన మూడు సంవత్సరాలకే నేను పుట్టాను. నన్ను యీ భూమిమీద పడేస్తూ నా తల్లి చచ్చిపోయింది. నా రాక ఓ అపశకునంగా ముద్రపడింది మా యింట్లో-చిన్నప్పుడు నాకో నానమ్మ ఉండేది. ఆమె మాటల్లో చెప్పాలంటే నేనో ముద

నష్టపుముండవి - పుడుతూనే తల్లిని పొట్టనపెట్టుకున్న పాపిష్టి జీవాన్ని.

నా తండ్రి మా అమ్మని ప్రేమగా చూసుకునేవాడో లేదో తెలియదు గాని- ఆమె చావుకి కారణం నేనేనన్న అభిప్రాయం ఆయన మనసులో బలంగా తిష్టవేసుకున్నది. నాకాయింట్లో ఎదురైన అనాదరణ పగులకి కూడా ఎదురవ కూడదు! సొంత నాన్నచేత అనాదరణగా చూడబడటం ఎంత ఘోరమో అనుభవించిన నాకే తెలుస్తుంది. ఇంట్లోనే వుంటారు - మాటిబోటి మాటలతో పోట్లు పొడుస్తూ మనస్సుని తునాతునకలు చేస్తారు. అట్లాంటి పరిస్థితుల్లో నేను జీవించగల్గింది ఒక్క మా అన్నయ్య వల్లే.

చిన్నప్పట్నుంచీ మా అన్నయ్యతో పాటు యింకో మొద్దబ్బాయి వచ్చేవాడు మా యింటికి. 'మొద్దబ్బాయి' అన్నది నేను పెట్టుకున్న పేరు. నిజానికి అతని పేరు రాజశేఖరం. చిన్నప్పట్నుంచి ఈ యిద్దరితో కూడిన ప్రపంచమే తప్ప బయటి ప్రపంచం అంతగా తెలియని దాన్ని. ఎన్నోసార్లు నేనూ రాజశేఖరం అమ్మా, నాన్నల ఆటలు చిన్నప్పుడు అర్థం తెలియక ఆడుకున్నాం.

ఓ రోజు మా నాన్న, నేను మా అన్నయ్య రాజశేఖరంతో కలిసి ఆడుకుంటూ వుండటం చూసాడు. అంతే! అన్నయ్యని లోపలి గదిలోకి లాక్కెళ్ళి తలుపు గడియపెట్టి దబదబ బాదసాగాడు అన్నయ్యని. "ఒరేయ్ అప్రాచ్యపు వెధవా! అప్రాచ్యపు వెధవల్తో కలుస్తా వట్రా! వాడి కులమేమిటి! మన కుల మేమిటి! వాడో మాలనా..." అంటూ ఇంకా చాలాచాలా నీచంగా తిట్టాడు.

కొద్దిక్షణాల తరువాత తిరిగిచూద్దును కదా- రాజశేఖరం అక్కడ లేడు. తల వంచుకుని వెళుతున్నాడు. అంతలో నాన్న గది తలుపులు తెరుచుకుంటూ వచ్చి నా జుట్టు అందుకుని ఎడాపెడా వాయించి "ఒసేవ్ ముదనష్టపు ముండా! నీక్కూడా చెబుతున్నా వాళ్ళ యింకోసారు యింట్లోకి రానిచ్చారో మక్కెలిరగ దంతాను" అని యీడ్చి కిందపడవేశాడు.

నేను అతి కష్టంమీద లేచి అన్నయ్య గదిలోకి తొంగిచూసాను. స్పృహ లేకుండా పడివున్నా డన్నయ్య.

భోరుమని ఏడవడానిక్కూడా ఆరోజు కుదర్లేదు.

ఈ సంఘటన జరిగిన తరువాత కూడా రాజశేఖరంతో మా చెలిమి తగ్గిపోలేదు. ఇంకా చెప్పాలంటే అతనితోటి స్నేహం యింకా అభివృద్ధిచెందడానికి ఈ సంఘటన దోహదం చేసిందని చెప్పవచ్చు. ఎన్నోమార్లు అతని మాటలతో ఊరట చెందేదాన్ని. అతను యింటికి వచ్చే టప్పుడు నాన్న లేకుండా చూసుకునే వాళ్ళం. యవ్వనంలోకి అడుగు పెట్టడంతో రాజశేఖరంతోటి పరిచయం

కొత్త మలుపు తిరిగింది.

ఎన్నో విషయాలు అతను అనర్గళంగా చెబుతూంటే నోరు తెరుచుకుని వినేదాన్ని. అతను మాట్లాడుతూంటే అతని ముఖం లోకి ముఖం పెట్టి చూడాలనిపించేది. నాన్నాళ్ళ తరువాత నా మనసుని ప్రశ్నించుకుంటే- నేనతన్ని ప్రేమిస్తు న్నానని తెలిసొచ్చింది. కానీ ఏంలాభం? అంతగా ధైర్యం చెయ్యలేనిదాన్ని. పైగా ఎలా నా మనసువిప్పి అతనికి చెప్పుకోను-'రాజశేఖరం! నిన్ను ప్రేమి స్తున్నా'నని?

అలా చెప్పగలిగే ధైర్యం వచ్చేలోగా అతను ఉద్యోగంకోసం వెళ్ళిపోయాడు. అయిదేళ్ళు కావస్తోంది అతను వెళ్ళి. అయినా అతన్ని యిప్పటికీ నేను ప్రేమిస్తున్నానేమో అనిపిస్తుంది.

ఈ ఐదుసంవత్సరాల కాలంలో యింట్లో ఎన్నో మార్పులు. అన్నయ్య నా పెళ్ళికై సంబంధాలు చూడటం మొదలెట్టినాడు. నాన్న ఈ విషయంలో తనకు ఎట్టి సంబంధమూ లేదన్నట్టు మూడో వ్యక్తిలా మెలగసాగారు. అన్నయ్య ఉద్యోగం అంత గొప్ప ఉద్యోగమేమీ కాదు! నోట్లోకి నాలుగు వేళ్ళు పోయే దానికే చాలా కష్టపడవలసి వచ్చేది నాన్నకి పెన్షన్ డబ్బులు వచ్చేది. యింట్లో పైపాకూడా యివ్వక కూడబెట్టిన మనిషతడు. అన్నయ్య నా పెళ్ళికోసం నాన్నని ధనసహాయం అడిగాడు. అడిగినా యివ్వడని నాకు తెలుసు. అన్నయ్యకూ తెలుసు-అప్పుగా అయినా యిస్తాడేమో అనికూడా అడిగాడు.

నాన్న నసేమిరా వల్లకాదన్నాడు. కాను పైసా కూడా విదల్చనన్నాడు. "పెళ్ళి అవ్వాలని ఆ మొదనష్టపు ముండ నెత్తిమీద రాసుంటే జరుగుతుంది, లేకుంటే లేదు" అని తెగేసి చెప్పాడు.

అన్నయ్య తండ్రి అని వదిలిపెట్టాడు మరొక్కడైతే అక్కడే ఆయన్ని పాతి పెట్టి వుండడం తప్పక జరిగివుండును.

అన్నయ్య తన కోపాన్ని అణచు కోవడం నా దృష్టి నుంచి తప్పిపోలేదు. ఏం చేయగల్ను? మనసుని కళ్ళలోకి రప్పించుకోవడం తప్ప? ఏడుపొక్కటే నాకు శరణ్యం?

పై సంఘటన తరువాత అన్నయ్య నాన్న గురించి పట్టించుకోవటం మానేసాడు. కొద్దిరోజులక్రితం అన్నయ్య పెళ్ళి సంబంధం కోసమని పై వూరు వెళ్ళాడు రావడానికి రెండ్రోజులైనా పట్టొచ్చు న్నాడు.

మరునాటి పేకువజామున నాన్న తలుపు చెప్పాపెట్టకుండా మిత్రులతో సహా వచ్చాడు

నాకు ఆశ్చర్యం కలిగింది- ఇల్లు బ్రహ్మాండంగా వుందే! రిపేరు కూడా చేయించాల్సిన అవసరమూ లేదు- అటువంటప్పుడు ఈ మేస్త్రీలతో పనేమిటో

అని!

ఈ విషయాన్నే అడిగాను నాన్నని.

“నోర్ముయ్! మొదలుపెట్టినప్పుడే ఎందుకూ, ఏమిటీ అంటూ అపశకునం పలుకుతావా? పెంకులూడదీయించి డాబా వేయించబోతున్నా చాలా!” అన్నారు నాన్న.

“ఎంత తక్కువలో పని జరిపించాలన్నా పది, పదిహేను వేలవుతుందే! అంత డబ్బు ఎక్కణ్ణించి తెస్తాడు ఈయన?” నా అనుమానాన్ని బయట పెట్టాను. “మేస్త్రీ నాలుగువేలతో పనయి పోతుందని చెప్పాడులే- దానికోసం కూడా నేను ఎవ్వర్నీ దేహీ అనబోవటం లేదు” అన్నాడు.

అన్నయ్య ఊళ్లోలేడు ఈ సమయం చూసి ఇట్లాంటి చిక్కుసమస్య తెచ్చిపెట్టా వేమిట్రా భగవంతుడా అనుకున్నాను.

“నాన్నా! అన్నయ్య వచ్చినతరువాత అతన్ని కూడా కనుక్కుని పని ప్రారంభిస్తే బాగుంటుందేమో?” అన్నాను.

“నోర్ముయ్యవే ముదనష్టపుముండా! ఇది నాయిల్లు. నేనెలాగైనా చేసుకుంటా. ఇక్కడ ఎవ్వరి సలహా-సంప్రదింపులూ అక్కర లేదు” అన్నాడు.

చుట్టూ పనికొచ్చిన కూలీవాళ్ళు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

నాకు తల కొట్టేసినట్టయ్యింది!

కన్నీళ్ళు చెక్కిళ్లపై కారుతూంటే తుడుచుకుని తలవంచుకున్నాను

మధ్యతరగతి యువతిని. అబలని- నేనేం చెయ్యగలను? ఎలా ఈ సమస్యకి పరిష్కారం చూపించగలను- ‘భగవంతుడా! నన్నీ జైలు జీవితంనుంచి కాపాడు’ అని ప్రార్థించుకున్నాను. ఆ క్షణంలో ఎందుకో తెలియదుగాని రాజశేఖరం చటాలున మదిలో మెదలాడు. ఎక్కడున్నాడో! పెళ్ళిచేసుకుని సుఖంగా ఓ పాపతో వుంటాడేమో? పెళ్ళైన వారి గురించి ఆలోచించడం తప్పుకాదూ?

సాయంత్రానికల్లా పనివాళ్ళు యింటి పైకప్పు పూడబెరికినారు.

పైకప్పు లేని యిల్లు-నా జీవితంలాగే బోసిగా వుంది.

3

## కోవెల చెప్పిన కథ

“... చెల్లి పెళ్ళికోసం సంబంధం చూసుకొని నేను తిరిగి వచ్చేసరికి మొండి గోడలతో, పడగొట్టేసిన స్తంభాలతో, పైకప్పులేని బోసి యింటిని చూడవలసి వచ్చింది రాజశేఖరం!” అన్నాడు భావనారాయణ- వీరభద్రుని కోవెల ధ్వజ స్తంభానికి ఆనుకుని నిట్టూరుస్తూ.

కొంతదూరంలో, వారికి కుడివైపుగ ఆలయప్రాకారంలో ఎవరో స్వామి వారు మంద్రస్థాయిలో వీరభద్రేశ్వర స్వామి జననాన్ని గురించి భక్తులకు చెబుతున్నారు. ఆయన పలుకులు అలలు

అలలుగా ఆ సాయంకాలపు తల్లని ప్రకృతి ఒడిలో కలిసిపోతున్నాయి

"తరువాత ఏమయ్యింది భావన్?" అన్నాడు రాజశేఖరం

"ఏముంది రాజశేఖరం! నాలుగువేల రొక్కంతో పెంకుటింటిని దాబాగా మార్చటం ఈ కాలంలో ఎవరి తరం? పైకప్పు లేకుండా చేతిలోని డబ్బుకాస్తా అయిపోయింది. ఆ యింటిని అలాగే ఎలా వదిలిపెట్టేసి రాజశేఖరం! నా దగ్గరున్న ఆరువేల రూపాయల్ని ఆ యిల్లు బాగుచేయించటానికి నాన్నకు యిచ్చివేశాను. ఇల్లు పూర్తయ్యేదాకా వేరే యింట్లో వుందాం రమ్మని నేనూ, సీతా నాన్నతో చెప్పి చూశాము. చస్తే ఆ కొంపలోనే చస్తాగాని ఎక్కడికీ రానని గీగిసుకుని కూర్చున్నాడు నాన్న...

భావనారాయణ ఒక్కక్షణం ఆగిపోయి మళ్ళీ అసలు విషయంలోకి వచ్చాడు— "కానీ రాజశేఖరం! ఆరువేలు యిచ్చానన్నావు చూశావా? అది చిట్టితల్లి పెళ్ళికి కట్నంగా ఇవ్వాలని అట్టిపెట్టుకున్న డబ్బురా! దాంతో చిట్టితల్లి సంబంధం మళ్ళీ తప్పిపోయింది."

భావనారాయణ కళ్ళల్లో మెదిలిన కన్నీటిబిందువు అతని చేతిలోని గడ్డి పోచమీదకు జారిపోయింది

వింటున్న రాజశేఖరం మ్రాన్పడిపోయాడు.

'ఏం చెయ్యగలను నేను? సీతకి ఎలా సహాయం చెయ్యగలను? నావల్ల ఏమవుతుంది? నిట్టూర్పు తప్ప నేను చెయ్యగలిగింది ఏమీలేదా' రాజశేఖరం మనసులో భావాలు సుళ్ళు తిరుగుతున్నాయి.

అంతలో...

"అన్నయ్యా! అన్నయ్యా!" అంటూ ఓ అమ్మాయి టకటకా అడుగులు వేసుకుంటూ వచ్చేసింది.

భావనారాయణ ఆలోచనల్లోంచి తేరుకుని తలెత్తి చూసి "అరె! సీతా నువ్వా ఎప్పుడు వచ్చావు యిక్కడికి?" అని, అంతలో రాజశేఖరంవైపు తిరిగి "మా సీతరా!" అన్నాడు. మళ్ళీ సీతతో తనే- "గుర్తున్నాడా అమ్మా? రాజశేఖరం!" అన్నాడు.

ఆ క్షణాన సీత సిగ్గు మొగ్గయిపోయింది. ఆ క్షణంలో ఆమె మదిలో మెదిలిన భావాలకు రూపకల్పన చేయడం ఎవరితరమూ కాదు.

ఇక రాజశేఖరం విషయం వేరే చెప్పాలా?

"నమస్తే!" అన్నది సీత- తేరుకుని రెండుచేతులూ జోడిస్తూ.

రాజశేఖరం చేతులు అనాలోచితంగా కలిపాడు అతని చెవుల్లో 'కుందనపు బొమ్మ' అని అతను ఆప్యాయంగా పెట్టిన పేరు మారుమోగింది. సీత అలాగే అతన్ని చూస్తూ వుండిపోయింది.

భావనారాయణ విభ్రాంతుడై సీరి

కదలికలను చూడసాగారు।

"ఈ సీత నా ప్రాణసతి ఐతే?" ఒక్క క్షణం రాజశేఖరం మనస్సులో మెదిలిందా భావం. మరుక్షణంలో "అసలు నేనెవరు? నా కులమేమిటి? నాకూ, సీతకూ కుదురుతుందా?" అని తలపోశాడు రాజశేఖరం.

అలనాటి ప్రేమ- ప్రేమభావం మనస్సులో బడబాగ్నులను సృష్టించ సాగింది-

"రాజశేఖరం!......రాజశేఖరం!" అంటూన్న భావనారాయణ మాటలు ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టు అనిపిస్తూంది రాజశేఖరానికి.

స్వామివారి వీరభద్రేశ్వరుని కథ అతని శ్రవణాలకు సోకుతోంది

"...అలా సతీదేవి దక్షుని అనాదరణకు చింతించింది. దుఃఖించింది. దక్ష యజ్ఞంలో హోమగుండ ప్రవేశంచేసి ఆత్మార్పణ చేసుకున్నది- ఆ జగన్మాత.

సమస్తలోకం దిగ్భ్రాంతితో- విభ్రమతో వీక్షించింది.

అక్కడ—

పరమేశ్వరునికి ఈ విషయం తెలిసింది.

దుఃఖావేశంతో, కోపావేశంతో బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్టు హుంకారం చేసినాడు పరమేశ్వరుడు-

తన జటాజూటమునుండి ఒక జటను పెరికి పర్వతమునకు వేసికొట్టినాడు. ఆ క్షణాన రౌద్రాకారంలో కోటి సూర్య ప్రకాశమానంగా, వివిధాయుధ యుక్తంగా సహస్రాకారాలతో, విడుపాటి కోరలతో భద్రకాళీ సమేతంగా వీరభద్రేశ్వరుడు ఉద్భవిస్తున్నాడు-

స్వామివారు భక్తిపారవశ్యంతో- భావావేశంతో ఉపన్యాసాన్ని కొనసాగించినారు-


"అయ్యలారా! అమ్మలారా! ఒక్కమారు పలకండి! వీరభద్రస్వామికి..."

భక్తాదులు "జై!" అంటూ ముక్తకంఠంతో జేజేలు పలికినారు!

"అలా వీరభద్రస్వామివారు బయలుదేరుతున్నారు! భూనభోంతరాలు మ్రాన్పడిపోయాయి! దక్షయజ్ఞం ధ్వంసం కాబోతూన్న తరుణం వచ్చేస్తూన్నది! వీరభద్రస్వామివారి ప్రమథగణం ముందుకు పురుకుతున్నది! అసలు అసలు...జగన్మాతకు జరిగిన అవమానం, ఆ మాత ఎదుర్కొన్న అనాదరణ- స్త్రీజాతికే అవమానం కాదా?..." స్వామివారి వీరవిహారం కొనసాగుతూంది!

రాజశేఖరంలో భావావేశం పెల్లుబుకుతున్నది! అతనికి తెలియకుండానే అంతరంగంలో కొత్తశక్తి పొంగుతున్నది!

"నేను తక్కువ కులంవాణ్ణి కావచ్చుగాక! ఆ ఒక్క కారణంచేత సంవత్సరాల తరబడి నాలో...నా మనసులో నిక్షిప్తమైవున్న సీతమీది ప్రేమ తెలుపుకోకుండా ఎందుకు నేను మౌనం వహించాలి! - ఇంకానా?" రాజశేఖరం




తలచిపెట్టలేని ఆవేశం...

"భావన్! భావన్! నేను...నేను... సీతని ప్రేమిస్తున్నాను-ఆమె కిష్టమైతే నాదాన్నిగా నేను చేసుకుంటాను-" రాజ శేఖరం మాటలు—మంద్రంగా వెలు వడ్డాయి.

భావనారాయణ అయోమయంగా చూడసాగాడు.

రాజశేఖరం కొనసాగించాడు- "భావన్! చిన్నప్పట్నుంచీ సీతతోటి స్నేహం యవ్వనంలో ప్రేమగా చిగు రించిందని నీకెలా చెప్పగలను ఆ రోజుల్లో! తక్కువకులంలో పుట్టానని సంఘం నిరాదరించే ఆ రోజుల్లో నేను ఎలా చెప్పుకోగలను భావన్! నువ్వునే వాడిని- అండదండగా లేకుండా వుంటే- సీత పరిచయమే నాకు అలభ్యమయి వుంటే అసలు...అసలు...నేని రోజు ఏ పరిస్థితుల్లో ఉండేవాడినో- ఒక్కసారి! ఒక్కసారి ఆలోచించుకుంటే ఒళ్ళు కంపిస్తుంది! ఇట్లాంటి పరిస్థితుల్లో నే నిలా సీతని నాదానిగా చేసుకుంటానని నిన్ను కోరడం..."

మళ్ళీ అతను సీతవైపు తిరిగి అన్నాడు—

"సీతా! మనస్ఫూర్తిగా చెబుతున్నాను నువ్వంటే నా కిష్టం! నీకు నచ్చితేనే- నేను...నేను...ఐ మీన్- మన వివాహం జరుగుతుంది!"

అంత తటాల్న అతడలా అన టంతో పడమట పొడిచిన సూర్యుణ్ణి చూచినదానిలా నిర్ఘాంతపోయింది సీత. రాజశేఖరం సాదరపూర్వకంగా తన అరచేతిని సీతవైపు సాచాడు!

ఒక్క క్షణం స్తబ్దత...మరుక్షణం సీత అరచేయి అతని అరచెయ్యినందు



తున్నది। లావనారాయణ ఆ రెండు అర చేతుల్నీ ఆనందంతో కలిపాడు-అతని కనుకొలకుల నుంచి జాలువారిన కన్నీటి బిందువులు కాదు- ఆనందబాష్పాలు- ఆ పాణిగ్రహణాన్ని అభిషేకించాయి

"శ్రీరాచవీటి నగరే గోపురత్రయ
రాజితే।
మందిరే కృతవాసాయ వీరభద్రాయ
మంగళమ్।"

స్వామివారు మంగళం పాడుతున్నారు।

వీరభద్రేశ్వరస్వామి సంతృప్తితో కటాక్షవీక్షణాలను కురిపిస్తున్నట్టు లావ నారాయణకు అనిపించింది।

సీత, రాజశేఖరం అరచేతిని గట్టిగా పట్టుకుని వుంది— అంతకన్నా గట్టిగా రాజశేఖరం, సీత అరచెయ్యిని పట్టుకుని వున్నారు- చేతికందిన పెన్నిధి జారిపో తుందేమోనన్నట్టుగా।